
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 416 క్యూసెక్కులు విడుదల చేశారు.



దుర్గమ్మకు గొలుసు బహూకరణ

తెనాలిటౌన్: నందివెలుగు అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కనకదుర్గమ్మకు బంగారు గొలుసును బహూకరించారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



రేపల్లె: పవిత్ర కార్తిక మాసం కృతిక నక్షత్రాన్ని పురస్కరించుకుని పట్టణం లోని ఇసుకపల్లి చెన్నమల్లే శ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి అఖిలభారత ఫైన్ ఆర్ట్స్ ఫెస్ట్

ఏఎన్‌యూ : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫైన్‌ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఫైన్‌ఆర్ట్స్ ఫెస్ట్, ఆర్ట్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమవుతుంది. ఈ ఫెస్ట్‌లో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన ఏడు యూనివర్సిటీల నుంచి ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు పాల్గొంటున్నారు. చిత్రకళ, శిల్పకళా ప్రదర్శన, వర్క్‌షాప్, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ముఖ్య అతిధిగా హాజరవుతారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొంటారు.

క్వారీ బాలకోటేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం



చేబ్రోలు: జిల్లాలో ఖ్యాతి గాంచిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామికి గురువారం ఏకాదశ రుద్రాభిషేకాలు ఘనంగా జరిగాయి. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బాలకోటేశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, హోమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

3న తెనాలిలో జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

తెనాలి: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికను డిసెంబరు 3వ తేదీన తెనాలిలో నిర్వహించనున్నారు. క్రీడాకారుల ఎంపిక స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడాస్టేడియంలో జరుగుతుందని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 2008 సంవత్సరం లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని సూచించారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన జట్లు డిసెంబరు 9–10 తేదీల్లో తెనాలిలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆడాల్సి ఉంటుందని వివరించారు.

యార్డుకు 41,974 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 41,974 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 40,321 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 23,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 12,731 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

3న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

గుంటూరు, తెనాలిలో 13 పరీక్షా కేంద్రాలు

గుంటూరుఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలకు ఎంపిక చేసేందుకు ఉద్దేశించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఈనెల 3న జరగనుంది. గుంటూరు జిల్లాలో దరఖాస్తు చేసిన 2,400 మంది విద్యార్థులకు గుంటూరు నగర పరిధిలో ఏడు, తెనాలిలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుంది. పరీక్ష నిర్వహణపై ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులతో గురువారం గుంటూరు స్టాల్ బాలికోన్నత పాఠశాలలోని ప్రభుత్వ పరీక్షల విభాగంలో సమావేశమైన డీఈవో పి.శైలజ పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లపై సూచనలు చేశారు. విద్యార్థులు హాల్ టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీవోవీ. ఇన్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

అల్లారుముద్దగా...

దిగ్విజయంగా జగనన్న గోరుముద్ద

- పాఠశాలల్లో పసందైన విందు
- ఆకర్షణీయమైన మెనూ
- ఆరగిస్తున్న విద్యార్థుల సంఖ్య పెరుగుదల
- గత ప్రభుత్వంలో సరిగా అమలు కాని మధ్యాహ్నభోజన పథకం

1,00,000
ప్రస్తుతం జగనన్న గోరుముద్ద స్వీకరిస్తున్న విద్యార్థులు



గుంటూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు మధ్యాహ్న భోజన వడ్డన (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారుల యోగక్షేమాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. తల్లిదండ్రులు ఎలాగైతే అల్లారుముద్దుగా చూసుకుంటారో అలాగే పాఠశాలల్లో పిల్లలకు అందించే జగనన్న గోరుముద్ద విషయంలో సర్కారు ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. బలవర్ధకమైన పౌష్టికాహారంతో కూడిన ఆకర్షణీయ మెనూతో రోజుకో కొత్త రుచిని అందిస్తూ జగనన్న గోరుముద్ద పథకాన్ని దిగ్విజయంగా అమలు చేస్తోంది. పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ రైస్‌తోపాటు కోడిగుడ్డు, చిక్కీలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది. ఫలితంగా రోజురోజుకూ బడుల్లో మధ్యాహ్నభోజనం తినే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం 85శాతానికిపైబడి విద్యార్థులు జగనన్న గోరుముద్ద స్వీకరిస్తున్నారు. గత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజనం తీసుకున్నవారి సంఖ్య ఎప్పుడూ 45శాతం దాటలేదు.

ఏజెన్సీలకూ అండగా

జగనన్న గోరుముద్ద అందిస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీలకూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా కేటాయింపులు చేస్తోంది. ఫోర్టిఫైడ్ బియ్యంతోపాటు కోడిగుడ్డు, బెల్లం, వేరుశెనగపప్పుతో తయారు చేసిన చిక్కీలను పంపిణీ చేస్తోంది. ఎప్పటికప్పుడు సక్రమంగా బిల్లులు చెల్లిస్తోంది. గత ప్రభుత్వం ఏజెన్సీలను ముప్పుతిప్పలు పెట్టింది. ఎప్పుడూ సక్రమంగా బిల్లులు చెల్లించిన పాపన పోలేదు. దీంతో ఏజెన్సీలు అప్పులతో సతమతమయ్యేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏజెన్సీలు చాలా సంతోషంగా ఉన్నాయి. జగనన్న గోరుముద్దను విజయవంతం చేస్తున్నాయి.

జిల్లాలో ఇలా..

పాఠశాల	సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	824	46,984
ప్రాథమికోన్నత	83	13,532
ఉన్నత	170	57,199
మొత్తం	10,77	1,17,715

కేటాయింపులు ఇలా..

ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో ఒక్కో విద్యార్థికి మధ్యాహ్న భోజనం ద్వారా గతంలో కేటాయించిన రూ.4.97ను ప్రస్తుతం ప్రభుత్వం రూ.5.55కు పెంచింది. హైస్కూల్ స్థాయిలో ఒక్కో విద్యార్థికి గతంలో రూ.7.45 ఇవ్వగా, ప్రస్తుతం రూ.8.17కు సర్కారు పెంచింది.

ప్రతినెలా 10వ తేదీలోపే బిల్లుల చెల్లింపు

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు చెల్లింపులనూ సర్కారు పటిష్టంగా చేపడుతోంది. జగనన్న గోరుముద్ద సైట్‌లో ప్రతి నెలా 5వ తేదీలోపు బిల్లులను అప్‌లోడ్ చేసిన తరువాత 10వ తేదీలోపు చెల్లింపులు జరిపేలా చర్యలు చేపట్టింది. గతంలో నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండేవి.

ప్రతినెలా బిల్లులు చెల్లిస్తున్నారు



విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నందుకు ప్రతి నెలా సక్రమంగా బిల్లులు చెల్లిస్తున్నారు. గతంలో నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో అప్పులు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం అటువంటి పరిస్థితులు లేవు.

– షేక్ రిహానా, ఏజెన్సీ నిర్వాహకురాలు, ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, గుంటూరు

భోజనం ఎంతో రుచిగా ఉంటోంది



పాఠశాలలోనే రోజూ మధ్యాహ్న భోజనం చేస్తున్నాం. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారు. గతంలో ఆహార పదార్థాలు రుచిగా ఉండేవి కావు. ఇంటి దగ్గర నుంచి బాక్స్ తెచ్చుకునే దానిని. ఇప్పుడు మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే తింటున్నాను.

– సాజియా, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, గుంటూరు

ప్రతి సచివాలయం పరిధిలో మరో రూ.20 లక్షలు

- గడప గడపకు పనులపై ప్రభుత్వం నిర్ణయం
- రూ.20 లక్షలు ఖర్చు చేసిన చోట అదనపు పనులకు నిధులు
- జిల్లాలో 1029 అభివృద్ధి పనులు
- రూ.67.14 కోట్లు కేటాయింపు
- ఇప్పటికే 445 పనులు పూర్తి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ప్రతి సచివాలయం పరిధిలో మరో రూ.20 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన పనుల కోసం ప్రతి సచివాలయాలనికి రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ పనులు పూర్తయ్యి ఇంకా పనులు చేయాల్సిన చోట కొత్తగా నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం అంగీకారం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు ప్రతి నియోజకవర్గానికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా అక్కడ గుర్తించిన సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా పనులు మరిన్ని జరిగే అవకాశం ఏర్పడింది. దీనిలో భాగంగా రోడ్లు, డ్రైయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు వెంటనే చేపడుతున్నారు. 2022–24 సంవత్సరాలకుగాను జిల్లాలోని వివిధ విభాగాలకు బడ్జెట్ మంజూరైంది. పంచాయతీరాజ్ తెనాలి డివిజన్‌కి రూ. 7.48 కోట్లు, పంచాయతీరాజ్ గుంటూరు ఈఈ రూ.5.92 కోట్లు, గుంటూరు గ్రామీణ నీటిసరఫరా విభాగానికి రూ.9,.31 కోట్లు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కి రూ.23.52 కోట్లు, పొన్నూరు మున్సిపాలిటీకి రూ.2.65 కోట్లు, తెనాలి మున్సిపాలిటీకి రూ.6.38 కోట్లు, తాడేపల్లి–మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.2.55 కోట్ల నిధులు కేటాయించారు. ఇప్పటి వరకూ రూ.67.14 కోట్ల విలువైన 1029 పనులు మంజూరయ్యాయి. 467 పనులు ప్రోగ్రెస్‌లో ఉండగా, 445 పనులు పూర్తయ్యాయి. రూ.33.24 కోట్ల విలువైన పనులు ఇప్పటి వరకూ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. 406 బిల్లులు అప్‌లోడ్ చేయగా రూ. 25.99 కోట్ల బిల్లులు మంజూరయ్యాయి. ఇంకా 117 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఒక్క గుంటూరు మున్సిపాలిటీలోనే రూ.29.19 కోట్ల పనులు ప్రారంభం కావడం విశేషం.

గడప గడపకు సమస్యలకు ప్రాధాన్యం

గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా గుర్తించిన సమస్యలను అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో దీనికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎప్పటికప్పుడు ఈ పనుల పురోగతిని సమీక్షిస్తున్నట్లు చెప్పారు. తాజాగా రూ.20 లక్షల పనులు పూర్తి చేసిన సచివాలయాలకు అవసరమైతే మరో రూ.20 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

4 నుంచి అంతర్ కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్

గుంటూరుఎడ్యుకేషన్: ఏఎన్‌యూ అంతర్ కళాశాలల మెన్స్ వాలీబాల్ టోర్నమెంట్ ఈనెల 4,5,6వ తేదీల్లో టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. గురువారం పట్టాభిపురంలోని కళాశాలలో టోర్నమెంట్ బ్రోచర్‌ను కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం విడుదల చేశారు. కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందడంలో క్రీడలు దోహదం చేస్తాయని తెలిపారు. క్రీడాకారుల్లో నైపుణ్యాలను బయటకు తీసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడే విధంగా అద్భుతమైన అవకాశాలు క్రీడలు కల్పిస్తాయని అన్నారు. ఏఎన్‌యూ పరిధిలోని కళాశాలల్లో చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ కార్యదర్శి ఆర్.శివాజీ, సంయుక్త కార్యదర్శి బి. శ్రీనివాసరావు, సభ్యులు డాక్టర్ జీవీ సుధీర్‌కుమార్, జి.సురేష్, మేజర్ పి.కుమార్‌రాజు, స్వామి పాల్గొన్నారు.

సమాచార కాలుష్యాన్ని వెదజల్లుతున్న

బాబు అనుకూల మీడియా

- ఎల్లో మీడియా తప్పుడు కథనాలపై అప్రమత్తంగా ఉండాలి
- తెలుగు, సాంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి




మాదిరెడ్డిని సన్మానిస్తున్న తెలుగు, సాంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి

నగరంపాలెం: చంద్రబాబు అనుకూల మీడియా సమాచార కాలుష్యాన్ని వెదజల్లుతోందని తెలుగు, సాంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని పెన్షనర్స్ భవన్‌లో ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'తెలుగు మీడియా గమనం– గమ్యం' అనే అంశంపై సదస్సు గురువారం నిర్వహించారు. సదస్సుకు అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్.కృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఇప్పుడున్న ఆ పత్రికలు దుర్మార్గంగా మారాయని ఆరోపించారు. చంద్రబాబుకు వత్తాసుగా ఉన్న వర్గ మీడియా గతంలో ఎన్టీ రామారావు ప్రభుత్వాన్ని 8 నెలలు తిరగకుండానే కూల్చి వేశారని గుర్తు చేశారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ ఛానళ్లు టీవీ–5, ఏబీఎన్ విలువల్లేకుండా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో భారతి అనే పత్రిక సాహిత్యానికి పునాది అని, అప్పట్లో పద్యాలతో పోరాడి పోటాపోటీగా పద్యాలు రాసుకునేవారని చెప్పారు.

- ఫోరం ఫర్ బెటర్ సొసైటీ కన్వీనర్ మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మంచిని కూడా చెడు ఉద్దేశంతో ఒక అబద్ధంగా చెబుతున్నారని అన్నారు. దాన్ని గుడ్డిగా నమ్మితే ఎక్కడలేని నష్టం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వాలను కూల్చే పరిస్థితిని కొన్ని పత్రికలు తీసుకొస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే విషపూరిత పత్రికలకు బుద్ధిచెబుతారని హెచ్చరించారు.
- ఆంధ్రా అడ్వకేట్స్ ఫోరం కన్వీనర్ అశోక్ మాట్లాడుతూ ప్రసుత్తం ఈనాడు కాపీలను ఉచితంగా సరఫరా చేస్తుందని, ఏం ఆశించి కాపీలను ఉచితంగా అందిస్తుందని ప్రశ్నించారు. ఆ పేపర్‌ను కొనుగోలు చేసే వారులేరని, ప్రజల్లోనూ మార్పు వస్తుందని చెప్పారు. తప్పుడు కథనాలను తిప్పికొట్టేందుకు యువత ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.
- మానవత స్వచ్ఛంద సంస్థ కో–కన్వీనర్ కె.సలీంమాలిక్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో అనేక మార్పులను సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చారని చెప్పారు.
- ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ముత్యం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్య రంగాల్లో గొప్ప మార్పులు తీసుకొచ్చారని అన్నారు. పిల్లలకు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే కోర్టుల్లో కేసులు దాఖలు చేయడం దారుణమని పేర్కొన్నారు.
- ఎ.పి. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్. కృష్ణంరాజు, సీనియర్ న్యాయవాది చుండూరు సుందరరామశర్మ, నవ్యాంధ్ర ఇంటిలెక్చ్యువల్ ఫోరం చైర్మన్, ఆచార్య డీఏఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. సీనియర్ పాత్రికేయులు మేకల కోటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం బెస్ట్ పర్సనాలిటీ అవార్డును మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డికి అందజేసి సత్కరించారు.

ఉన్నత విద్యలో నైపుణ్యం, నాణ్యత కీలకం

ఏపీ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు రామ్మోహనరావు



గుంటూరుఎడ్యుకేషన్: ఉన్నత విద్యలో నైపుణ్యం, నాణ్యతకు ప్రాముఖ్యత పెరిగిన నేపథ్యంలో బోధన, శిక్షణ రంగాల్లో నిరంతరం మార్పులు చేస్తూ ఉండాలని ఏపీ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య కె.రామ్మోహనరావు అన్నారు. గురువారం ఏపీ ఉన్నత విద్యామండలి–జేకేసీ కళాశాల సంయుక్తంగా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్–2024 అనే అంశంపై జేకేసీ కళాశాలలో ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య రామ్మోహనరావు మాట్లాడుతూ జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకులను సాధించడంలో కళాశాలలకు ఇటువంటి వర్క్‌షాప్‌లు ఎంతో ఉపయోగకరమన్నారు. చెన్నైలోని లయోలా కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఆర్.రవీంద్రన్ మాట్లాడుతూ ఎన్ఐఆర్ఎఫ్‌లో మంచి ర్యాంకు సాధించేందుకు కావాల్సిన అంశాలను వివరించారు. ఉన్నత విద్యామండలి అకడమిక్ అధికారి జి.శ్రీరంగం మాధ్యూ మాట్లాడుతూ ఎన్ఐఆర్ఎఫ్‌లో విభిన్న అంశాలను వివరించారు. వర్క్‌షాప్‌లో గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, ఏలూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ సమన్వయకర్తలతో పాటు జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాగర్ వద్ద హైడ్రామా

- ఏపీ జలవనరుల శాఖ అధికారులను అడ్డుకున్న తెలంగాణ పోలీసులు
- ఏపీ జలవనరుల శాఖ కోరిక మేరకు భద్రత కల్పించిన పోలీసులు
- రేంజ్ ఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు
- ప్రజల దాహార్తి తీర్చిన రాష్ట్ర ప్రభుత్వం



ఆంధ్రా, తెలంగాణ బోర్డర్ వద్ద బందోబస్తు

సాక్షి,నరసరావుపేట/మాచర్ల/విజయపురిసౌత్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న జల దోపిడీపై కృష్ణా రిజర్వాయర్ బోర్డుకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవటంతో ఏపీ ప్రభుత్వం గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. సాగర్ ప్రాజెక్టుపై 2014 నుంచి తెలంగాణ ప్రభుత్వం చెలాయిస్తున్న గుత్తాధిపత్యాన్ని అడ్డుకుంది. పోలీసు శాఖ సహాయంతో జలవనరులశాఖ విజయవంతంగా 13 క్లస్టర్ గేట్లు తన ఆధీనంలోకి తీసుకుంది. గత ప్రభుత్వం తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం చూపిన అలసత్వం వల్ల ఏపీ ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో తాగునీటి సమస్య నుంచి పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా ప్రజలకు విముక్తి కలగనుంది. ముందు జాగ్రత్తగా ప్రధాన ప్రాజెక్టు, టీ జంక్షన్, తెలంగాణ బోర్డర్‌లో ఆంధ్రా పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

బుధవారం రాత్రే చేరుకున్న బలగాలు

జలవనరుల శాఖ అభ్యర్థన మేరకు బందోబస్తు కల్పించడానికి బుధవారం అర్ధరాత్రికి పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి నేతృత్వంలో 1,311 మంది పోలీసులు విజయపురిసౌత్ ప్రాంతానికి బుధవారం రాత్రి చేరుకున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు బందోబస్తు కొనసాగించారు. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు బందోబస్తును సమీక్షించారు. తెలంగాణ పోలీసులు అడుగడుగునా అడ్డుపడుతున్నా చాకచక్యంగా వ్యవహరించి సాగర్ 13వ క్రస్ట్ గేట్ వద్ద కంచెను ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు. కుడి కాలువ ద్వారా నీటి విడుదల చేసి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడారు.

గడప గడపకు ఆరోగ్య సిరి

- నేటి నుంచి వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై అవగాహన కార్యక్రమాలు
- నెల రోజులపాటు ఇంటింటికి వైద్య సిబ్బంది, వలంటీర్లు
- ఆరోగ్యశ్రీ, సిటిజన్ యాప్‌లపై విశదీకరణ



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అవగాహన పోస్టర్లు



పోస్టర్లు అందజేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం గురించి ప్రజలకు వివరించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆరోగ్యశ్రీ అధికారులు సిద్ధమయ్యారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ సేవలను ఎలా పొందాలనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తగిన ఏర్పాట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పూర్తి చేశారు. నెల రోజులపాటు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని ఇళ్లకు వెళ్లి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ గురించి ప్రజలకు వివరిస్తారు. ఈ పథకాన్ని రూ.5 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలకు సైతం వర్తింప చేస్తున్నారు. ఈ పథకానికి సంబంధించిన బ్రోచర్, కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేయనున్నారు.

ఇంటింటికి వెళ్లి ...

జిల్లా వ్యాప్తంగా ఉన్న 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 47 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్‌లకు ఆరోగ్యశ్రీ బ్రోచర్లు, కరపత్రాలు అందజేశారు. అనారోగ్యం బారినపడినా, దురదృష్టవశాత్తూ ఏదైనా ప్రమాదం జరిగినా ఆరోగ్యశ్రీ కింద ఎలా చికిత్స పొందాలన్న దానిపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తారు. ఆరోగ్యశ్రీ యాప్, సిటిజన్ యాప్(ఆస్పత్రుల వివరాలు) వివరాలు తెలియజేస్తారు. ప్రభుత్వం అందజేసే బ్రోచర్‌లో ఆరోగ్యశ్రీ పథకం సేవలను ఎలా పొందాలి? ఏ సేవలు ఉంటాయి? వంటి అంశాలపై పూర్తి వివరాలు ఉంటాయి.

చికిత్సలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని మొట్టమొదటిసారిగా ఉమ్మడి ఏపీలో ప్రవేశపెట్టారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఆరోగ్యశ్రీ పథకానికి పునర్జీవం తీసుకొచ్చారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి 1059 ఉన్న ఆరోగ్యశ్రీ చికిత్సలను 3,255కు పెంచారు. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటే ప్రతి ప్రొసీజర్ను ఆరోగ్యశ్రీ పథకంలోకి తీసుకొచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కరోనా, బ్లాక్ ఫంగస్, మిస్–సీ వంటి జబ్బులను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలోకి తీసుకొచ్చారు. అన్ని రకాల క్యాన్సర్‌ను ఆరోగ్యశ్రీలోకి తీసుకొచ్చి పరిమితి లేకుండా ఎంత ఖర్చు అయినా ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను గణనీయంగా పెంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లోని 202 కార్పొరేట్ ఆస్పత్రుల్లో 17 సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఉచిత వైద్యం అందిస్తున్నారు. ఆపరేషన్‌ల అనంతరం కోలుకునే వరకు ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి రోజూ రూ. 225 చొప్పున అందిస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ 15 నిమిషాలు వివరిస్తారు



జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం గురించి వివరించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. పథకంపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్‌లకు పంపిణీ చేశాం. జిల్లాలో 136 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 33 ప్రభుత్వ ఆసుపత్రులు, 75 ప్రైవేటు ఆసుపత్రులు, 28 డెంటల్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుతున్నాయి. ఏఎన్‌ఎం ఒక్కో ఇంట్లో 15 నిమిషాలు పథకంపై అవగాహన కల్పించి వారి సెల్‌ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తారు.

– డాక్టర్ చీకటి విజయప్రకాష్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్

క్లుప్తంగా

రైల్వే లైన్లకు స్థలాలు వెంటనే అప్పగించండి

కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



గుంటూరు వెస్ట్: విజయవాడ–గూడూరు మూడో రైల్వే లైను నిర్మాణానికి సేకరించిన స్థలాల్ని వెంటనే ఆ శాఖ అధికారులకు అప్పగించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం రైల్వే అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే లైనుకు సంబంధించి పొన్నూరు, మంగళగిరి మండలాల్లో పలు స్థలాల్ని ఇప్పటికే సేకరించారని తెలిపారు. వీటిల్లో పెండింగ్‌లో ఉన్న వాటితో పాటు సేకరించిన స్థలాల్ని సైతం పరిశీలించి, తక్షణం ఆధీనంలోకి తెచ్చుకోవాలని అధికారులకు చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, రైల్వే డీజీఎం సుధీర్ బాబు, అసిస్టెంట్ మేనేజర్ మోహన్, కాశీరత్నం పాల్గొన్నారు.

3న పంచారామాలకు ప్రత్యేక బస్సులు

నరసరావుపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని పంచారామాలకు 3, 10 తేదీల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట కుమార రామం, ద్రాక్షారామం, భీమారామం, పాలకొల్లు క్షీరారామం భీమవరం సోమారామం, అమరావతి అమరారామాలకు ఆదివారం రాత్రి 9 గంటలకు బయలుదేరి సోమవారం ఐదు క్షేత్రాలు దర్శించుకునే విధంగా స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు 7382896041, 7382896038. 9959225428 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఘంటసాల జయంతి మాసోత్సవాలు

బాపట్ల అర్బన్: ఘంటసాల 101 జయంతి సందర్భంగా ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, ఘంటసాల కళాభిమానులు, సంగీత అభిమానులు, సోదర సంఘాల ఆధ్వర్యంలో డిసెంబరు 1 నుంచి మాసోత్సవాల్ని నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం చైతన్య భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. చీరాలలో ఉదయం 10 గంటలకు ఘంటసాల విగ్రహం వద్ద, మధ్యాహ్నం 12:30 గంటలకు బాపట్లలోని ఘంటసాల విగ్రహం వద్ద ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమాల్లో ఘంటసాల చైతన్య వేదిక సభ్యులు, సంగీత ప్రియులు పాల్గొనాలని కోరారు.

పకడ్బందీగా ఎస్‌ఏ-1 పరీక్షలు

- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఉమ్మడి ప్రశ్న పత్రం
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితం
- ప్రైవేటు పాఠశాలలకు నామమాత్రపు రుసుం



ఎస్‌ఏ-1 పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ–1) పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) రూపొందించిన ఉమ్మడి ప్రశ్నపత్రంతోనే అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ విభాగంలో 182 ఉన్నత, 80 ప్రాథమికోన్నత పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్ష మండలి (డీసీఈబీ) ద్వారా ప్రశ్నపత్రాల్ని పంపిణీ చేస్తున్నారు. ప్రైవేటు విభాగంలో 290 ఉన్నత, 201 ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు సైతం డీసీఈబీ ముద్రించిన ప్రశ్నపత్రాలతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు 987 ప్రాథమిక పాఠశాలలకు ప్రశ్న పత్రాలు డీసీఈబీ ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ రూపొందించిన అకడమిక్ కేలండర్‌కు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు విద్యార్థులకు ఉమ్మడి ప్రశ్నపత్రాలతోనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎస్సీఈఆర్టీ రూపొందించిన ప్రశ్నపత్రాల్ని డీసీఈబీ ద్వారా ముద్రించి ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా సరఫరా చేస్తుండగా, ప్రైవేటు పాఠశాలల నుంచి ముద్రణ, రవాణా ఖర్చుల్ని ఒక్కో విద్యార్థికీ నామమాత్రపు రుసుం నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ప్రశ్న పత్రాల్ని మండలాల్లోని స్కూల్ కాంప్లెక్స్‌లకు పంపి, ఎంఈవోల పర్యవేక్షణలో భద్రపరుస్తున్నారు. ప్రతి రోజూ పరీక్షకు గంట ముందుగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పంపుతున్నారు.

పంపిణీలో పూర్తి పారదర్శకత



ప్రశ్న పత్రాల ముద్రణ, పంపిణీలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నాం. వాటిని నేరుగా స్కూల్ కాంప్లెక్స్‌లకు పంపి, పరీక్ష జరిగే రోజున పాఠశాలలకు ఇస్తున్నాం.

–జి.లలిత ప్రసాద్, డీసీఈబీ కార్యదర్శి, గుంటూరు

ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై. షేక్

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ''జగనన్న ఆరోగ్య సురక్ష'' ప్రజలకు రక్షగా నిలిచిందని వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై. షేక్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పేదలు జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. జిల్లా పరిధిలోని రూరల్ ప్రాంతాల్లో 82,743 మంది, అర్బన్ ప్రాంతాల్లో 79,676 మంది, కంటికి సంబంధించి 36,398 కలిపి మొత్తం 1,98,717 మంది ఆరోగ్య సురక్షలో ఓపీ ద్వారా వారి ఆరోగ్య సమస్యల్ని పరిష్కరించుకున్నట్లు వివరించారు. దానిలో భాగంగా రూరల్ పరిధిలో 212, అర్బన్‌లో ప్రాంతాల్లో 223 క్యాంపులు కలిపి 425 నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా 2,543 మందికి కంటి ఆపరేషన్లు చేశారన్నారు. అన్ని క్యాంపుల్లో కలిపి మొత్తం 107 మంది వైద్యులు సేవలు అందించగా, వారిలో 87 మంది కిడ్నీ, గుండె, కళ్లు, లివర్, నరాలతో పాటు అనేక రకాల స్పెషలిస్టులు సేవలు అందినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యులతో పాటు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం డాక్టర్లు సైతం అనేక క్యాంపుల్లో పాల్గొని సేవలందించారని వివరించారు. క్యాంపుల్లో భాగంగా 63,920 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించి వారికి మందులు అందజేయడంతో పాటు తీసుకోవాల్సిన చర్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారని చెప్పారు. శిబిరాల్లో 8,160 మందికి బీపీ, 4,986 మందికి షుగర్, 8,394 మందికి కళ్లె పరీక్షలు నిర్వహించామన్నారు. ఇందులో 31 మందికి టీబీ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా 3,043 మందిని పలు రకాల వైద్యం, చికిత్సల నిమిత్తం ఆయా దగ్గరలోని ఆసుపత్రులకు పంపినట్లు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ముందుగా రూరల్ పరిధిలో 2,84,000 మంది, అర్బన్ పరిధిలో 4,09,000వేల మందికి సంబంధించి ఇంటింటికీ సర్వే నిర్వహించారని వివరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ డాక్టర్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సెహెచ్. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్

- వీసీ ఆచార్య రాజశేఖర్
- ఏఎన్‌యూలో అవగాహన ర్యాలీ



జెండా ఊపి ఫార్మసీ ర్యాలీని ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం వీసీ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వైద్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. ఫార్మసీ విద్యార్థులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యం, పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే మంచి అవకాశాలు సొంతం చేసుకోవచ్చని తెలిపారు. ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఉపాధి, పరిశోధనా అవకాశాలు సొంతం చేసుకోవాలని ఆయన సూచించారు. ఫార్మసీ ఆవశ్యకతను తెలియజేస్తూ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు నిర్వహించడం మంచి పరిణామని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.ప్రమీలారాణి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు. 'రోగి భద్రతను నిర్ధారించడానికి ఫార్మాసిస్టులలో చేరండి' అనే అంశంపై నిర్వహించిన ఈ ర్యాలీలో ఫార్మసీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్లకార్డులు చేతబట్టుకుని యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాల నుంచి ప్రధాన ద్వారం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ర్యాలీ అనంతరం వ్యాసరచన, రంగోలి, మెహందీ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు.

రేంజ్ పరిధిలో ముగ్గురు సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్ పరిధిలోని నగరంపాలెం సీఐగా విధులు నిర్వహిస్తున్న హైమారావును గుంటూరు రేంజ్ వీఆర్‌కు, ప్రకాశం జిల్లా ట్రాఫిక్ పీఎస్ సీఐ కె.మల్లికార్జునరావును గుంటూరు జిల్లాలోని నగరంపాలెం పీఎస్ సీఐగా బదిలీ చేశారు.పట్టాభిపురం సీఐగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో పల్నాడు జిల్లాలోని నరసరావుపేట –2టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న వీరేంద్రబాబును నియమించారు.

మెడికల్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం(గుంటూరువెస్ట్): గుంటూరు నగరంలోని పలు మందుల దుకాణాల్లో కాలం చెల్లిన మందులను విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు విజిలెన్స్, ఔషధ నియంత్రణ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొరిటెపాడులోని పళని మెడికల్ ఫార్మసీలో భారీగా గడువు తీరిన మందులను గుర్తించారు. అదే ప్రాంతంలోని మరో ఫార్మసీలో ఫార్మాసిస్టు లేకుండా మందులు విక్రయించడాన్ని గుర్తించారు. నిబంధనల ఉల్లంఘనపై దుకాణదారులపై కేసు నమోదు, భారీగా కాలం చెల్లిన మందులు గుర్తించడంతో మెడికల్ ఫార్మసీ లైసెన్సు రద్దు నివేదిక పంపించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐలు ఎ.శ్రీహరిరావు, శ్రీనివాసులురెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు మహేష్, పద్మ, పాల్గొన్నారు.

సుద్దపల్లిలో 689 మందికి కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు అందుకున్న వారితో ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

సుద్దపల్లి(చేబ్రోలు): గ్రామీణ ప్రాంతాల్లోని పేదల కోసం బజరంగ్ ఫౌండేషన్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు అందిస్తున్నట్లు వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా చేబ్రోలు మండలం సుద్దపల్లిలో బజరంగ్ నేత్ర జ్యోతి ఉచిత కళ్లజోళ్ల పంపిణీని గురువారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో 689 మందికి ఉచితంగా కళ్ల జోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సామాజిక సేవ, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ స్ఫూర్తి కలగలిపి తమ ఫౌండేషన్ కార్యక్రమాల్ని కొనసాగిస్తున్నదని తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించిన ఐదు రోజుల్లోనే వారి లోపం ఆధారంగా కళ్లజోళ్లను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

'పాదిల' బ్లాక్‌లో రెండు అంతస్తుల నిర్మాణానికి అనుమతి



ఎం.టి.కృష్ణబాబును కలసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ త్రిపురనేని రవికుమార్

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆస్పత్రి పాదిల ప్రసాద్ బ్లాక్‌లో మిగిలిపోయిన రెండు అంతస్తులను నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నట్లు జింకానా పూర్వ అధ్యక్షుడు డాక్టర్ త్రిపురనేని రవి కుమార్ తెలిపారు. మంగళగిరి ఏపీఐఐసీ టవర్స్‌లో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబును గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్, డాక్టర్ త్రిపురనేని రవి కుమార్ గురువారం కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ త్రిపురనేని రవి కుమార్ మాట్లాడుతూ పాదిల ప్రసాద్ బ్లాక్‌లోని రెండు అంతస్తుల నిర్మాణానికి జింకానా రూ.10 కోట్లు సమకూర్చనున్నట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు. మాత శిశు సంరక్షణ కేంద్రం త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయనున్నామని వెల్లడించారు. వచ్చే ఏడాది ఆగస్టు నాటికీ పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నామని వివరించారు. అంకిత భావంతో మాతృ సంస్థకు చేస్తున్న కృషికి కృష్ణ బాబు అభినందించారని చెప్పారు. రాష్ట్రంలో జింకానా సహకారం మరింతగా అందించాలని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాజెక్టులు చేపట్టాలని ఆయన సూచించారని వివరించారు. రాష్ట్రంలో కర్నూలు, కాకినాడ జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులను కూడా అభివృద్ధి చేసేందుకు ఆ జిల్లాల పూర్వ విద్యార్థులు, ప్రవాస భారతీయులు ముందుకు వచ్చేవిధంగా తోడ్పాటు అందించాలని కృష్ణ బాబు చెప్పినట్లు పేర్కొన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసపత్రి, మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు స్ఫూర్తిదాయకమైన పనులు చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు మళ్లీ కలయికతో పూర్వ విద్యార్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఎం.టి.కృష్ణ బాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌లను ఆహ్వానించినట్లు వెల్లడించారు. మళ్లీ కలయిక సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కోసం విరాళాలు సేకరిస్తున్నట్లు వివరించారు.

రేపు, ఎల్లుండి ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధి తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో డిసెంబర్ 2, 3 తేదీల్లో ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్, తూర్పు ఈఆర్వో కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలోని 532 పోలింగ్ బూత్‌ల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు ఓటర్ల జాబితా, వివిధ ఫారాలతో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ జాబితాలో తమ ఓటు ఉన్నదీ, లేనిదీ స్వయంగా పరిశీలించుకోవాలని సూచించారు. మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే సంబంధిత బీఎల్‌వోకి తగిన ఆధారాలతో దరఖాస్తును అందించాలని చెప్పారు. ఓటర్ల తుది జాబితా విడుదలకు జనవరి 5ను ఎన్నికల సంఘం గడువు ప్రకటించినందున, ముసాయిదా సవరణకు ఇదే ఆఖరి అవకాశమని ఆమె తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువత స్వచ్ఛందంగా ఓటు కోసం ఫారం–6 ని పూర్తి చేసి పొందాలని కమిషనర్ సూచించారు. ఇప్పటికే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఓటర్ల హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, సమాచారం కోసం 0863–2345104, 2345105 నంబర్లకు ఫోన్ చేయవచ్చని ఆమె తెలిపారు.

తెలుగు కవిత్వానికి బాటలు వేసిన నన్నయ

నన్నయ సహస్రాబ్ది ఉత్సవాల్లో శతావధాని బాలసుబ్రహ్మణ్యం



నన్నయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

అద్దంకి: సంస్కృతంతో ఉన్న మహాభారతాన్ని తెనిగించేందుకు పునాది వేసి ఒక చట్రాన్ని తయారు చేసిన ఆదికవి నన్నయ అని శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం అన్నారు. నన్నయ సహస్రాబ్ది సందర్భంగా సృజన ఆధ్వర్యంలో గురువారం సాహిత్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసభకు శతావధాని నారాయణం బాల సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు కవిత్వానికి బాటలు వేసిన కవి నన్నయ్య అని గుర్తు చేశారు. నన్నయ సహస్రాబ్ది ఉత్సవాలు సృజన ఆధ్వర్యంలో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. నన్నయ కవితా రీతులు ప్రత్యేకంగా ఉంటాయని సాహితీవేత్త గాడేపల్లి దివాకర దత్తు అన్నారు. ఆయన కవితల్లో అక్షర రమత్య గోచరిస్తుందని చెప్పారు. నన్నయ కవి తెలుగు కవులందరికీ పితామహుడి వంటివాడని చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి కీర్తిశేషులు గాడేపల్లి సీతారామమూర్తి జీవిత సాఫల్య పురస్కారాన్ని మహా మహోపాధ్యాయ శలాక రఘునాథ శర్మకు ఇవ్వడం అభినందనీయమన్నారు. నాతండ్రి పేరు మీద ఇవ్వడం గర్వకారణంగా ఉందన్నారు. తొలుత నన్నయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు చందలూరరి నారాయణరావు మాట్లాడుతూ నేటి తరానికి శేషేంద్రశర్మ సాహిత్యం ఒక పాఠ్య గ్రంథం వంటిదని గాడేపల్లి అన్నారు. ఆయన తెలుగులో అలంకార శాస్త్రం, ఆధునిక మహాభారతం, కవిసేన మేనిఫెస్టో తదితర రచనలు చేసి భావితరాలకు మార్గదర్శకుడయ్యారని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు, సృజన సాహిత్య సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

43 సంచుల గన్ పౌడర్ పట్టివేత



గన్‌పౌడర్ బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

బల్లికురవ: లైసెన్స్ లేకుండా బ్లాస్టింగ్ గన్ పౌడర్ నిల్వ చేస్తున్నట్లు సమాచారం అందటంతో గురువారం బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ వేమన దాడులు నిర్వహించారు. బల్లికురవ మండలంలోని వేమవరం, నాలుగు రోడ్ల కూడలికి సమీపంలో మార్టూరు మండలం నాగరాజుపల్లె గ్రామానికి చెందిన కె.హరిబాబు, మ్యాగ్‌జైన్ ఏర్పాటు చేసి బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని గ్రానైట్, మెటల్ క్వారీలకు బ్లాస్టింగ్ మెటీరియల్ సరఫరా చేస్తుంటాడు. ఈ మ్యాగ్‌జైన్‌లో 43 బ్యాగ్‌ల గన్‌పౌడర్‌ను లైసెన్స్ లేకుండా నిల్వ చేయగా డీఎస్పీ తనిఖీతో సీజ్ చేశారు. బ్లాస్టింగ్ మ్యాగ్‌జైన్‌లో అనుమతి ఉన్నవాటినే నిల్వ ఉంచాలని, అనుమతి లేని మెటీరియల్ నిల్వ చేయటం చట్టరీత్యా నేరమన్నారు. అలా చేస్తే కేసు నమోదుతోపాటు, మ్యాగ్‌జైన్‌ను సీజ్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు.

'మిస్టర్ ఆంధ్రా' పోటీల్లో రేపల్లె యువకుడి ప్రతిభ



రేపల్లె: అనకాపల్లి జిల్లా యలమంచిలిలో ఈ నెల 26వతేదీన నిర్వహించిన 27వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీలలో రేపల్లె యువకుడు ప్రతిభ కనపరిచి కాంస్య పతాకాన్ని సాధించాడు. పట్టణంలోని బీఆర్ఎస్ పవర్ జిమ్‌లో ట్రైనర్ భూపతి రాజేష్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న ఈవీఎస్ కుమార్ యలమంచిలిలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీలలో 60 కిలోల విభాగంలో మూడవస్థానంలో నిలిచి కాంస్య పతాకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా జిమ్ నిర్వాహకుడు రాజేష్ మాట్లాడుతూ కుమార్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

గురుకుల పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభం



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న కలెక్టర్ లోతేటి, ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానంతో విద్యనందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను గురువారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ రూ.1.40 కోట్ల నాబార్డు నిధులతో నూతన తరగతి గదులు నిర్మించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ వినుకొండలో అదనపు గదుల నిర్మాణంతో పాటు ఎస్టీ బాలుర పాఠశాల నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలంలో రూ.5 కోట్ల నిధులతో నూతన భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న వసతి సౌకర్యాలు సద్వినియోగించుకొని మంచి మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని చెప్పారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ వరలక్ష్మి, ఈఈ లత, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, వార్డు కౌన్సిలర్ షకీలా దస్తగిరి, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

వన భోజనాల పేరుతో... రియల్ ఎస్టేట్ వ్యాపారం

- మేజర్ కాలువ కట్టపై రోడ్డు నిర్మాణం
- చెట్లు, తోటలు లేని చోట వన భోజనాలా అంటూ స్థానికుల పెదవి విరుపు
- అక్రమణలను అధికారులు అడ్డుకుంటే రాజకీయం చేస్తున్న ప్రతిపక్షాలు



అధికారులు తొలగించిన పట్టణంలోని అమరావతి మేజర్ కాలువ కరకట్టపై వేసిన రోడ్డు

సత్తెనపల్లి: భూముల వ్యాపారానికి వనభోజన కార్యక్రమాన్ని అడ్డుపెడుతున్నారు. ఎన్ఎస్పీ అధికారుల అనుమతి లేకుండా అమరావతి మేజర్ కాలువ కట్టపై రోడ్డు నిర్మించారు. ఒక సామాజిక వర్గ వన భోజనాల కోసం అంటూ... గుంటూరు రోడ్డులోని పట్టణ శివారులో ప్రధాన రహదారి వద్ద నుంచి అమరావతి మేజర్ కాలువ పక్కన కరకట్టపై జలవనరుల శాఖ అధికారుల అనుమతులు లేకుండా అనధికారికంగా రోడ్డు నిర్మించారు. ఒక్క రోజు కార్యక్రమానికి కాలువ కరకట్ట పక్కన ఉన్న పొదలు తొలగించి, గుంతలు చదును చేస్తే సరిపోయేది. దీనికి భిన్నంగా అధికారుల అనుమతి లేకుండా.. నాణ్యమైన గ్రావెల్ తోలి, చదును చేసి, డస్టు వేసి శాశ్వత రహదారి స్థాయిలో చేయాల్సిన పని ఏమిటని స్థానికుల ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదానికి సుమారు ముప్పావు కిలోమీటర్ దూరంలో టీడీపీ సానుభూతి పరుడు(ఓ ప్రముఖ కాంట్రాక్టర్) కు సుమారు పది ఎకరాల భూమి ఉంది. దానిని రియల్ ఎస్టేట్‌కు సిద్ధం చేసేందుకే ఇది అని పలువురు విమర్శిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న అధికారులు అనధికారికంగా కాలువ పక్కన కరకట్టను ఆక్రమించి ఏర్పాటు చేస్తున్న రోడ్డును తొలగించారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కంటగింపుగా మారింది. వారు ఊహించిన దానికి భిన్నంగా జరగడంతో దీనికి రాజకీయరంగు పులుముతున్నారు. ఈ ఘటనపై జలవనరుల శాఖాధికారులు, పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులు చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పీ.ప్రభాకరరావు తెలిపారు.